www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 29 జూలై 2023

కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని హరినాథ్ డిగ్రీ కళాశాల వద్ద అటవీ ప్రాంతం నుంచి వచ్చిన జింకను శుక్రవారం కుక్కలు వెంబడించాయి. భయంతో పరుగులు తీసిన జింక పట్టణంలోకి రావడంతో స్థానిక ప్రజలు చుక్కల దానిని రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జింకను పశువైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పశు వైద్యులు ధృవీకరించారు. అనంతరం జింకకు పంచనామా చేసి అటవీ అధికారులకు అందజేశారు. పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

జింకను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గిరీష

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష, ఎస్‌పి గంగాధర్‌రావు, ఇతర అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై (ఎస్సీ, ఎస్టీ పిసిఆర్, పిఒఎ, యాక్ట్) జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, సాంఘీక సంక్షేమం, ప్రాసిక్యూషన్ ప్రధాన విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులను సూచించారు. అన్యాయం జరిగిన వారి పక్కన జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. 01-04-2023 తేదీ నుంచి 30-06-2023 తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి17 కేసుల్లో 09 కేసులకు సంబంధించి రూ.6.87 లక్షలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఛార్జ్‌సీట్ ఎఫ్ఐఆర్ స్టేజిలో 6 కేసులకు సంబంధించి రూ.6 లక్షలు మంజూరైందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కేసులలో ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. అనంతరం డివిఎంసి సభ్యులు లలితమ్మ పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అవగాహన పెంపొందించడానికి, పిల్లల బాల్యాన్ని రక్షించడానికి మాతో చేరండి వాల్ పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ, జెసిల చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్పీ గంగాధర్‌రావు, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, మురళిలు, రామకృష్ణారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారికత జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, డీఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపొందించడం లక్ష్యం కావాలనికలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ఓటర్ జాబితా సవరణ అంశంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల వారీగా ఉన్న జంక్, సున్నా డోర్ నెంబర్ ఓట్లు ఎన్ని గుర్తించారు, అందులో ఉన్న ఓటర్ల సంఖ్య ఎంత, ఎన్ని కేసులు పరిశీలించారు, ఎన్నింటిని సరి చేశారు, డోర్ నెంబర్ వారీగా ఫామ్-8 ఎంత మంది వద్ద తీసుకు న్నారు, ఇంకా ఎంత తీసుకోవాల్సి ఉంది తదితర అంశాలపై సమీక్షించారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేసులు, 100 సంవత్స రాలు పైబడిన వారి కేసులు ఎన్ని, పరిశీలించినవి ఎన్ని, ఇంకను పరిశీలించాల్సిన సంఖ్య తదితరాలపై తాసిల్దార్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ వారీగా బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి తప్పనిసరిగా ప్రతి ఓటును పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్ వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఒక ఇంటిలో ఎన్ని ఓట్లు ఉన్నా ప్రతి ఓటు వివరాలను పరిశీలన చేయాలని తెలిపారు. ఏదైనా మృతి చెందిన వారు, అక్కడ లేని వారి వివరాలను పక్కగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మరో పోలింగ్ స్టేషన్ పరిధిలోకి మారి ఉంటే ఆ వివ రాలను కూడా నిర్దేశిత ఫారంలో పక్కగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని డోర్ నెంబర్ల వారీగా మరొ కసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఓట్ల పరిశీలనలో ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా పాటించాలని తెలి పారు. క్లెయిమ్స్, అభ్యంతరాలు పక్కాగా పరిశీలించాలన్నారు. ఫామ్-8లో దరఖాస్తుదారు సంతకం తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. తొలగింపులకు సంబంధించి ఫారం-7 ఇచ్చినప్పుడు ఫిర్యాదుదారుకు, ఆ కుటుంబానికి రెండు నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా అంశాలపై వారి వారి పరిధిలో తహశీల్దార్లతో ఆర్‌డిఒలు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆగస్టు 21లోగా ప్రతి ఇంటిలో ఓట్లను తప్పనిసరిగా వెరిఫై చేసి తప్పులు లేని స్వచ్ఛ మైన ఓటర్ జాబితాను రూపొందించాలన్నారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్‌డిఒలు రంగ స్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, తహశీల్దార్ల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

చందన ప్రియకు సర్టిఫికెట్ ఇస్తున్న అర్షియా

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లికి చెందిన పెంచ లయ్య, సరళల కుమార్తె చందన ప్రియ కేన్సర్ బాధితుల కోసం తన కేశాలను దానం చేసింది. ఆమెకు ప్రశంస పత్రంతో పూలమొక్క బహుకరించి అభినం దించిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అర్షియా. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ కేన్సర్ బాధితుల కోసం గొప్ప మనసును చాటుకుంటున్న చిన్నారులు,యువతులు, మహిళల సేవలు అభినందనీయమని ఇప్పటికి 35 మంది కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ భాదితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ అందిస్తుందని పేర్కొన్నారు. హెయిర్ డోనార్ చందన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో ముందు ఉండాలని, కేశాలు దానం చేయడానికి తన తల్లిదండ్రులు సైతం ప్రోత్సహం అందించారని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు చాను, అమీన్, కిరణ్ పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులకు ప్రతి ఏటా ప్రదానం చేసే పురస్కారాలకు ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ 'అర్పిత' దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ గౌరవ సలహా దారులు గొల్లపూడి తిరుపతిరావు తెలిపారు. విద్య, వైద్యం, విధి నిర్వహణ, సమాజ సేవ, నృత్యం, కళ, క్రీడ, సాహిత్యం, చిత్రలేఖనం, పర్యావరణ పరి రక్షణ, శాస్త్రీయ సంగీతం (నాదస్వరం, డోలు, సాక్సోఫోన్, గాత్రం) ఆధ్యాత్మికం, ఉపాధి కల్పన తదితర రంగాల్లో ప్రతిభ గల వ్యక్తులు, చిన్నారులు అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే ఎంపిక ప్రక్రియలో భాగంగా రాష్ట్ర స్థాయి 'ఆంధ్ర రత్న' 'తెలంగాణ రత్న' 'స్టేట్ బెస్ట్ సిటిజన్' అవార్డులతో పాటు, ఇద్దరు అత్యుత్తమ ఉపాధ్యాయులకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్' ఇతర రంగాల్లో సేవలందించిన పదిమందికి 'నేషనల్ బెస్ట్ సిటిజన్', 'లైఫ్ టైం అచీవ్ మెంట్' అవార్డులను అందజే యనున్నారు. అభ్యర్ధుల కేటగిరీల వారీగా 'కళాబంధు', ఎన్టీఆర్ స్మారక 'కళా విభూషణ్' డాక్టర్ సి.నా.రె.స్మారక 'సాహిత్య కళానిధి', ప్రముఖ నృత్య కళాకారులకు 'సిద్ధేంద్రయోగి నాట్య కళా విశారద' జాతీయ అవార్డులతో పాటు ఏదైనా మూడు రంగాల్లో విశేష ప్రతిభ గల ఇద్దరికి భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టా త్మకమైన 'భారత ప్రతిభారత్న' ప్రతిష్టాత్మక పురస్కారం అందజేయనున్నామని వివరించారు. ఆసక్తి, ప్రతిభ ఉన్నవారు తమ దరఖాస్తులను 7780589775 వాట్సాప్ నెంబర్‌కు ఆగస్టు 7వ తేదీలోగా పంపుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఆగస్టు 28వ తేదీన హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అవార్డులను సినీ, రాజకీయ, అధికార ప్రముఖుల చేతుల మీదుగా ప్రధానం చేయనున్నామని వివరించారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని బోయనపల్లి అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ అను అంశంపై బిటెక్ సిఎస్ఇ విద్యార్థులుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారి వై.నిశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించాలంటే కొత్త కొత్త ఆలోచనలు, కొత్త పద్ధతులలో ఆలోచించాలని పేర్కొన్నారు. ఇతర సంస్థల పోటీని అధిగమించాలని పేర్కొన్నారు. సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉండాలని తెలిపారు. సరియైన ప్రణాళిక, లక్ష్య దిశగా ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు, ఎఐటిఎస్ ఇడిసి కన్వీనర్ డాక్టర్ పి.బాల చెన్నయ్య, సిఎస్ఇ కన్వీనర్ డాక్టర్ కె.బాల, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందిని మాజీ టిటిడి పాలకమండలి సభ్యులు, టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ఘనంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో కొలువుదీరే హుస్సేన్, హుస్సేన్‌ల పేరిట వెలిసే సవార్లు (పీర్ల)ను భక్తిశ్రద్ధలతో కొలుస్తారని పేర్కొన్నారు. పీర్లను ముస్లింలతో పాటు హిందువులు కూడా నమ్మి కొలుస్తారని తెలిపారు. నియోజకవర్గం ప్రజలందరికీ మొహరం(పీర్ల) పండుగ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచాలి : జెసి

- 1368 మంది ఎస్‌సి రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రూ.1.37 కోట్ల ఖర్చుతో 1368 మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు విత్తనాలను సరఫరా చేశామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం (పిఎంఎజెఎవై) కింద జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు విత్తనాల కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సాధికార సంస్థ వారు జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో సేంద్రీయ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 1368 మంది ఎస్‌సి రైతులను గుర్తించామని పేర్కొన్నారు. ఎస్‌సి రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలువ చేసే వివిధ విత్తనాల కిట్లను రాయితీతో సరఫరా చేశామన్నారు. జొన్నలు, మొక్కజొన్న, జీలగలు, పిల్లి పెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, కందులతో పాటు కిచెన్ గార్డెన్ కిట్ తదితరాలు ఉంటాయన్నారు. ఈ కిట్లను రైతులు సద్వినియోగం చేసుకోని అభివృద్ధి చెందాలన్నారు. వారు సాగు చేసే పొలంలో కనీసం 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయాన్ని సంవత్సరం పొడుగునా చేయాలని జిల్లాలో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచాలని కోరారు. ప్రతి ఎస్సీ రైతు అదనపు ఆదాయ వనరులు ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతో రాష్ట్ర విత్తనాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ఎస్సీ రైతులకు విత్తనాలు, పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్కొక్క ఎస్సీ రైతుకు రూ.1870 విలువ చేసే సీడ్ టు సీడ్ కిట్లు, గట్ల మీద వేసేందుకు కంది, కిచెన్ గార్డెన్ కిట్లను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఎస్సీ రైతులందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులు జిల్లాలో ఇంకా ఎవరైనా ఉంటే తమ కార్యాలయాన్ని లేదా క్షేత్రస్థాయిలో జడ్‌బిఎన్ఎఫ్ డిపిఎంను సంప్రదించాలని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్క ఎస్సీ రైతుకు రూ.7,630 విలువ కలిగిన ఇతర అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు, ఫెరామిన్ ట్రాప్స్, లూర్స్, ఎల్లో స్టికీ ప్లేట్స్, టార్పాలిన్స్, డ్రమ్ములు మొదలగునవి కూడా త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం యశోదమ్మ, రైతులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు విత్తనాల కిట్‌ను అందజేస్తున్న జెసి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : గిరీష

మొక్క నాటుతున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి-రాయచోటి

వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని, దానిని బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ గిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని దిగువ అబ్బవరం గ్రామ పంచాయతీ నక్కలవాండ్లపల్లి సమీపంలో క్రికెట్ స్టేడియం చుట్టూ, స్టేడియం రోడ్డు కిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్‌పితో పాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆయన తల్లి ఖుష్నుమాబేగం, కలెక్టర్ సతీమణి స్నేహా, ఎస్‌పి సతీమణి అర్.పద్మజ, కమిషనర్ సతీమణి లావణ్య, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, సర్పంచ్ మమత హాజరై మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో బాగంగా పచ్చదనం పెంపుదలకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలను విరివిగా నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మన చుట్టూ ఉన్న ప్రదేశాలు పచ్చదనంతో నిండి ఉన్నట్లయితే వాయుకాలుష్యం కాకుండా మొక్కలు తోడ్పడతాయని, స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తాయన్నారు. ఇప్పుడు మనం నాటిన మొక్కలు భావితరాలకు ఫలాలను అందిస్తాయన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఎస్‌పి గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని, అప్పుడే పచ్చదనాన్ని పెంచుకోవచ్చన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెరిగినప్పుడే గాలిలో ఆక్సిజన్ పెరగడంతో పాటు వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, డ్వామా సీడీ మద్దిలేటి, డిఇఒ పురుషోత్తం, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, తహశీల్దార్ హేమంతకుమార్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మూడు నెలలుగా మణిపూర్‌లో కొనసాగుతున్న ఘోరమైన దారుణాలకు అక్కడి ప్రభుత్వమే కారణమని, కావున వెంటనే మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని, అక్కడ శాంతిని నెలకొల్పాలని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విసికె పార్టీ, బాస్ సంయుక్తంగా ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ కొండల్లో నిక్షిప్తమై వున్న విలువైన లోహాలు, ఖనిజాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకే మంటలు రాజేశారని చెప్పారు. కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ లతోపాటు వీసీకే మరియు బాస్ నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, రాయల్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

వాల్మీకిపురం : మణిపూర్‌లో శాంతిని ప్రసాదించాలని జామియా మసీదు వద్ద శుక్రవారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. జుమా నమాజ్ అనంతరం ముస్లింలు మసీదు వెలుపల నిలబడి మణిపూర్‌లో నెలకొన్న అశాంతి పట్ల విచారం వ్యక్తం చేశారు. మాటలలో కూడా చెప్పలేని విధంగా అక్కడి మహిళలపై జరిగిన దాష్టీకాలు, క్రౌర్య చర్యలు మానవత్వాన్ని మంట గలిపాయని, రెండు జాతుల మధ్య నెలకొన్న గొడవలు సమాజంలో మారణ కాండను ప్రేరేపించడం శోచనీయమని పేర్కొన్నారు. మే 4న జరిగిన ఒక సంఘటనకు యావత్తు సమాజం కుమిలిపోయిందని, కించబడి పోయిందని, క్రోధంతో రగిలిపోయిందని, ఈ సంఘటన మణిపూర్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ఉపముతవల్లి జవాద్ హుస్సేన్ సాహెబ్, మండల కో-ఆప్షన్స్ సభ్యుడు మహబూబ్ బాషా, మైనారిటీ నాయకులు, పాల్గొన్నారు.

మదనపల్లె : నిరసన తెలుపుతున్న నాయకులు

మాట్లాడుతున్న డిఇ చంద్రశేఖర్‌రెడ్డి

డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాడాలి

- నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాడాలని విద్యుత్ శాఖ డిఇ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విద్యుత్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం రెండో రోజు నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిలు వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత మార్గంలో దశల వారీ ఆందోళనా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రతిరోజు నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి విద్యుత్ కార్మికుడు ఈ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెఎసి రాయచోటి మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలునాయక్, వై.నాగరాజు, కో-కన్వీనర్ నరసింహులు నాయక్, విద్యుత్ శాఖ ఎఇలు, జూనియర్ ఇంజినీర్లు, జెఎసి సభ్యులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న పురుషోత్తం

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్

ప్రజాశక్తి-రాయచోటి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో బిసిలకు ప్రత్యేక గుర్తింపు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చారని కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం తెలిపారు. శుక్రవారం కలెక్టర్ గిరీషను పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరుల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ జిల్లా సంక్షేమ కమిటీ సభ్యుల నియామక పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించామన్నారు. కుమ్మరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, ఇడి బిసి కార్పొరేషన్ సిబ్బంది, హెచ్‌డబ్ల్యుఒ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసౌమ్యనాథుని సన్నిధిలో న్యాయమూర్తులు

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధ గాంచిన చారిత్రాత్మక, ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి వారిని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.ప్రదీప్ కుమార్, కడప సీనియర్ సివిల్ జడ్జి పి.కవిత కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించారు. జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆధ్వర్యంలో ఆలయ పూజారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించి, ఆలయ మర్యాదలతో శాలువా పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రదీప్‌కుమార్

బాధిత కుటుంబానికి నగదును అందిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలోని తమ్మిరెడ్డిపల్లి గ్రామానికి విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి ఇటీవల విద్యుత్ ఘాతానికి గురైన తీవ్రంగా గాయ పడ్డాడు. తన తండ్రితో కలిసి పొలంలో ఉన్న మోటార్‌కు మరమ్మతులు చేస్తుండగా దగ్గరలో ఉన్న 11కెవి విద్యుత్ వైరు తగిలి శరీరమంతా కాలిపోయి వేలూరు సిఎంసి ఆస్పత్రిలో పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న యువనాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ముక్కా ఫౌండేషన్ తరుపున రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు. ముక్కాపౌండేషన్ సాయం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు వ్యవసాయ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండల ప్రకృతి వ్యసాయం చేసే 15 మంది ఎస్‌సి రైతులకు శుక్రవారం జిల్లా స్పందన కార్యాలయంలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా నల్లగుట్ట పల్లె, చిట్లూరు, బండపల్లె రైతులకు రూ.10వేలు విలుపచేసే నవ ధాన్యం కిట్లు, కళ్ళం పట్టలు, డ్రమ్ములు ఎల్లో ప్లేట్స్ లింగాకర్షక బుట్టలు రైతులకు అందించినట్లు మండల ప్రకృతి వ్యవసాయ యాంకర్ సూరం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే 20మంది రైతులకు కందులు ఉచితంగా అందిం చామన్నారు. కార్యక్రమానికి జిల్లా ఎస్‌సి కార్పోరేషన్ అధికారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి యశోదమ్మ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ కృష్ణ చైతన్య

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు చిరుధాన్యాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ చిరుధాన్యాలతో పాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు, సేంద్రియ విధానం, ఎరువుల వాడకం వంటి పలు రకాల విధానాలను వివరించారు. చిరు ధాన్యాల ఆవశ్యకత, ప్రస్తుత సమాజంలో చిరు దాన్యాల కున్న డిమాండ్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

31న పుల్లంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఈనెల 31న సోమవారం నాడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. మండలానికి సంబంధించిన సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరుకావాలని ఆయన కోరారు. అధికారులు తమ శాఖపై పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోసవారిపల్లె పంచాయతీలో పర్యటించారు. తిరుమల గుట్టపల్లె, తరుగు వారి పల్లె, మాల పల్లె హరిజనవాడ, గట్టుమీద పల్లె, కోసు వారి పల్లె కస్పాలలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనపై ప్రశ్నించే ఆరా తీశారు. రాజకీయ పార్టీలకు కుల మతాలకు అతీతంగా నేడు సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరుతున్నదన్నారు. అభివృద్ధిలో తంబళ్లపల్లి నియోజకవర్గం ఆదర్శంగా నిలిపేందుకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా సంబంధిత అధికారులతో వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి రఘునాథ్, ఎంపిటిసి సభ్యురాలు శ్యామల కోటిరెడ్డి, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎఒ రమణ కుమార్, ఎపిఒ అంజనప్ప, అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సింగల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, బావాజీ, పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రైతులకు అన్యాయం

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి పాలనలో వ్యవసాయ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆరోపించారు. శుక్రవారం ఆయన కలికిరి టిడిపి కార్యాలయం అమరనాథ్‌రెడ్డి భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచినా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసి వ్యవసాయ రైతులకు తీవ్ర అన్యాయం చేశాడని విమర్శించారు. రాష్ట్రానికి, రైతులకు వెన్నెముకగా ఉన్న పోలవరం ప్రాజెక్టును పట్టించుకోవడంలేదని, జిల్లాలోని అడవిపల్లి, పించా, అన్నమయ్య ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని, హంద్రీనీవా ప్రాజెక్టును ఆటకెక్కించారని, బిందు, తుంపర్ల సేద్యం లో సబ్సిడీ పరికరాలు రైతులకు అందజేయడంలో పూర్తిగా విఫలమై రైతులను నట్టేట ముంచారని విమర్శించారు రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని రైతులే గద్దె దించుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎస్‌సిసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆగస్టీశ్వర్, మండల ఎస్‌టి నాయకులు శ్రీనివాస్‌వర్మ, రమేష్, వైజాగ్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని వెంగమరాజుపోడు సమీపంలో వెలసిన శ్రీ రామలమ్మ క్షేత్రంలో శుక్రవారం ముప్పాల హేమనవర్మ, లలితమ్మ ఆధ్వర్యంలో ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. గత మూడు రోజులుగా శత రుద్ర పురస్వర శత చండీ యాగం, టిటిడి ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పశివ సుబ్రహ్మణ్య, అవధాని పర్యవేక్షణలో స్మార్త పురోహి తులు జూటూరు నరసింహ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. భక్తులకు అద్దిపల్లె గ్రామ ప్రజలు,హేమనవర్మ, తరుణ్ వర్మ, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పార్వతీ పరమే శ్వరుల కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరాజు, న్యాయ వాదులు ఆర్‌సి సురేష్‌బాబు, వెంకట్రామరాజు, చలపాటి హరినాథ్, కే.నాగేం దర్‌రాజు, గునిశెట్టి రమేష్, సారథి, చంద్రరాజు, రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే మహిళా సాధికారత : టిడిపి

ప్రజాశక్తి-నందలూరు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళ సాధికారత సాధ్యమని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య అన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ గొల్లపల్లిలో పార్లమెంటరీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, అనసూయమ్మ, తాటి లక్ష్మి దేవి ల ఆధ్వర్యంలో మహాశక్తి మేనిఫెస్టోను శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య మాట్లాడుతూ మహిళల కోసం ఆడబిడ్డనిధి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత పథకం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, పూర్ టు రిచ్ పథకం ద్వారా నిరుద్యోగుల కోసం 20 లక్షల ఉద్యోగాలతో పాటు, యువగళం నిధి ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో క్లస్టర్ నాయకులు పసుపులేటి ప్రవీణ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు, టిడిపి నాయకులు జ్యోతి, శివ, మోడపోతుల రాము, పునగాని రాము, గిరిబాబు, గొబ్బిళ్ళ చలపతి, గొబ్బిళ్ళ మనోహర్, గోపినేని కొండయ్య, గాదె రవి, గంగాధర్, నారప శెట్టి శివ, చామంచి పెంచలయ్య, కుర్రమని, ఉప్పు శెట్టి రెడ్డయ్య, గంగనపల్లి శ్రీను, మా భాష, పూర్ణ, పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి సిఎం జగన్

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాయలసీమ ద్రోహి అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 2014-19లో రూ. 68,293 కోట్ల ఖర్చు పెడితే వైసిపి ప్రభుత్వం కేవలం రూ. 22,165 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. రాయలసీమ తీవ్ర నీటి ఎద్దడి తీర్చడానికి ఆనాడు కీ.శే.ఎన్‌టి.రామారావు రాయలసీమను అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో తెలుగు గంగ, గాలేరు-నగిరి, హంద్రీనీవా ప్రాజెక్టులను తీసుకొచ్చారని గుర్తు చేస్తున్నా నన్నారు. రాయలసీమకు ఇంత తక్కువ ఖర్చుపెట్టిన సిఎం జగన్ సీమ ద్రోహి కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కొమ్మ శివ, రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షులు కమతం నాగరాజు, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులెలరమేష్, లోకేష్ పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టో పత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : 'కొరముట్ల'

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కోరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో రూ.33లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. అనంతరం రూ.40 లక్షలతో చేపట్టిన చెరువుకట్ట మరమ్మతును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు లేని గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిఇఇ బాల నరసింహులు, ఇరిగేషన్ డిఇఇ చంగల్‌రాయుడు, ఎపి టూరిజం డైరెక్టర్ నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, పట్టణ కన్వీనర్ రమేష్, స్థానిక నాయకులు శ్రీకారం శివయ్య, కొరముట్ల చంద్రశేఖర్, మస్తాన్, హరి, కాంట్రాక్టర్ శివారెడ్డి, బాబు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలకడ

కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పారామెడికల్ ఆఫీసర్ డి.బి.గుర్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నెల 26 నుంచి ఈనెల 25 వరకు లెప్రసీ గృహముల సర్వే జరిగింది. సర్వేలో వచ్చిన 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కదిరాయి చెరువు గ్రామంలో కూడా కే. దేవేంద్ర అనే వ్యక్తికి వీపు పైన ఎక్కువ మచ్చలు ఉన్నాయని ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, తెలపడంలో వారి ఇంటికి కూడా పోయి కేసును కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఆ కేసు కుష్టివ్యాధికి సంబంధించినది కాదని వైద్య సదుపాయాలు జరిపి మందులు పంపిణీ చేస్తామన్నారు. దేవాలపల్లి శ్రీనివాసపురంలోఒక కేసు నమోదైందని అన్నారు. అనంతరం కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ ఎలాంటి సస్పెక్టెడ్ కేసులు నిర్ధారణ కాలేదన్నారు. ప్రాథమిక దశలోనే అప్రమత్తంగా ఉంటే త్వరగా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఎంపిహెచ్ఒ వెంకటేశు, పిహెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ల్యాబ్‌టెక్నీషియన్ జమీల్, అహ్మద్, ఫార్మసిస్టు షరీఫ్‌బాషా, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

బురదమయంగా మారిన జగనన్న కాలనీ రోడ్డు

దుర్భరంగా జగనన్న కాలనీ రోడ్డు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధి లోని కురువోనికుంటలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి వెళ్లే దారి దుర్భరం తయా రైంది. ఇంటి నిర్మాణాల కొరకు రాకపోకలు సాగిస్తున్న లబ్ధిదా రులు తీవ్ర అవస్థలు పడు తున్నారు. సరైన రోడ్డు లేక పోవడం, మట్టిరోడ్డు కావడం తో వర్షం పడితే చిత్తడిగా మారిపోతుంది. వర్షం ఆగిపో యాక గుంత'లమ యంగా మారి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ముఖ్యంగా ఇంటి నిర్మాణాలకు మెటీరియల్ తరలిం చాలంటే రోడ్డు ఇలా ఉండడం గమనించిన ఆటోవాలాలు అటువైపు రావాలం టే జంకు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీలోకి వెళ్లేందుకు సిమెంట్ రోడ్డు నిర్మించి, ఇబ్బంది లేకుండా చూడాలని గృహాలు నిర్మింకుం టున్న లబ్ధిదారులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో కురిసిన వర్షానికి వంగిమళ్ల పెద్దూరు కస్పాలో బస్టాండ్ సమీపంలో రహదారి చిత్తడి చిత్తడిగా మారింది. గత ప్రభుత్వంలో సిమెంట్ రోడ్లు వేశారు గాని లాభం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కొద్దిపాటి వర్షానికే నగరం బురద మయంగా మారిందంటే భారీ వర్షాలు వస్తే ఊరు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని అన్నారు. వర్షం పడితే నీరు నిలిచి చిత్తడి చిత్తడిగా మారుతుందన్నారు. పీర్ల పండుగకు చుట్టు ప్రక్కల జిల్లాల ప్రజలు తండోప తండాలుగా వస్తారని ఈ దారి పైన వాహనదారులు, పాదచారులు ప్రయాణం చేయాలంటే నరకయాతన పడు తున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన రోడ్డు

ముఖ ఆధారిత యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-చిన్నమండెం

అంగన్వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత యాప్‌ను రద్దు చేయా లని అంగన్వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లను ఇచ్చి వంట వండేందుకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులు, 2020 నుంచి పెండింగ్‌లోఉన్న పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటికి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

విద్యుత్ లైన్ ఎత్తు పెంచండి సారూ..!

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వైర్లు మెయిన్ రోడ్డుకి నడిభాగాన తక్కువ ఎత్తులో ఉన్నందున వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వాహనాల పైభాగాన తాకుతుండడంతో షార్ట్ సర్క్యూట్ అవుతుండడంతో విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ సమస్యను తెలియజేశామని, ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు విద్యుత్‌లైన్ ఎత్తు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చొరవ తీసుకొని కరెంటు తీగలను ఎత్తును పెంచి సమస్యను పరిష్కరించాలని బైపాస్ రోడ్డు కాలనీ వాసులు కోరుతున్నారు.

మహిళల పోరుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి రాయచోటి టౌన్

హింసపై మహిళల పోరుయాత్ర జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి యం.భాగ్యమ్మ అన్నారు.ఈ సంధ్బంగా ఆమె మాట్లాడుతూ హిందూపురం నుంచి ప్రారంభం అయిన జాతా ఆగస్టు 8న విజయవాడకు చేరుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోరుయాత్రకు సంబంధించిన షెడ్యూల్ ను ఆమె విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అనేక రకాల హింసలు, దాడులు పెరిగాయన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాని స్పందించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళల రక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కోరారు. ఇలాంటి దుర్ఘటనలను నిర్మూలించి మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం జరుగుతున్న జాతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మసీదుల అభివృద్ధికి చర్యలు

మదనపల్లె అర్బన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న మసీదులు, దర్గాలను అన్ని విధాల అభివృద్ధి చేసి వాటికి మహర్దశను తీసుకొస్తున్నామని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. శుక్రవారం వలసపల్లి గ్రామంలోని మస్జిదే బిలాల్‌ను సందర్శించి నమాజులో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు అహ్మద్, నౌషాద్, అయూబ్,ఇమామ్ సాబ్,నిజాముద్దీన్,ఆన్సర్ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మసీదులో నెలకొన్న సమస్యలు, మసీదులో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల గురించి తెలుసుకొన్నారు. అనంతరం మసీదు ప్రాంగణం బయట హర్ దిల్ మే వైయస్ఆర్,హమ్ సబ్ జగన్‌కే సాథ్ కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఏ.కరీముల్లా మాట్లాడుతూ మసీదుల అభివృద్ధికి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే సహకారంతోపాటు అవసరమైన మేరకు వక్ఫ్ బోర్డు నిధులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫయాజ్ మౌలానా, సాదిక్ మైనారిటీలు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న చేనేత కమ్యూనిటీ భవనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయతీలో నిర్మిస్తున్న చేనేత భవనం ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం భవన నిర్మాణ పనులను కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ దండు రామాంజులు, తొగట కార్పొరేషన్ డైరెక్టర్ శీలం రమేష్, కౌన్సిలర్లు ఎం.వి.రమణ, రామిశెట్టి శివయ్య, సంఖారపు వెంకటరమణలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత రంగానికి నీరుగట్టువారి పల్లె ప్రసిద్ధిగాంచిందని అన్నారుచేనేత కార్మికుల సంక్షేమా నికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,ఎమ్మెల్యే నవాజ్ బాషాలు పెద్దపేట వేస్తున్నారన్నారు. చేనేత కార్మికుల కోసం కమ్యూనిటీ భవన్ తాము అడిగిన వెంటనే వారు రూ.1.50 కోట్లు విలువ చేసే 10 కుంటలు కేటాయించి,భవన నిర్మాణానికి రూ.40 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేశారని కొనియాడారు.చేనేత రంగానికి ప్రాధాన్య తనిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కెకెరెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జన్మనిచ్చిన సొంతూరి రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో పెద్దకారంపల్లి పంచాయతీ అభివృద్ధికి తన వంతు సహాయంగా ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించానని పెద్దకారంపల్లికి చెందిన కృష్ణకుమారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద కారంపల్లి గ్రామపంచాయతీలోని ఆవసానిపల్లి అరుంధతివాడలో తాగునీటి దాహార్తిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సొంత నిధులతో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ చేశారు. వాటర ప్లాంట్‌నెఉ వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రెడ్డి మాట్లాడుతూ వృత్తిరీత్యా అమెరికాలో ఉన్నప్పటికీ పెద్ద కారంపల్లిపై ఉన్న మమకారం వెలకట్టలేనిదని అన్నారు. పంచాయతీలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తన వంతు సహాయంగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం నిర్వహిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాబు, నిర్వహకులు మన్నూరు రామలక్ష్మమ్మ, మన్నూరు సుబ్బారెడ్డి, సుభో ద్ రెడ్డి, శివరామిరెడ్డి, క్షత్రియ సంఘం భాస్కర్ రాజు, సుబ్బరాయుడు, డాక్టర్ హెచ్.వి రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లె రెవిన్యూ గ్రామంలోని ఆక్రమణకు గురైన ఎస్‌సి, ఎస్‌టి పేద వర్గాలకు చెందిన భూములను వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూమహజన రాష్ట్రకార్య నిర్వాహకులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం శుక్రవారం తహశీల్దార్ నరసింహకుమార్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992- 2010 సంవత్సరంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు అప్పటి ప్రభుత్వాలు అసైన్డ్ భూములు పంపిణీ చేశారని అన్నారు. పేద వర్గాల వారికి ఇచ్చిన అసైన్డ్ భూములను సర్వే చేసి వారికి ఆన్‌లైన్ చేయాలని కోరారు. రంగంపల్లె ఎస్‌టి కాలనీ వాసులకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు లేకపోవడం బాధాకరమని, తక్షణమే వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మస్తానయ్య, మహాజన సమితి మండల అధ్యక్షుడు హేమంత్ కుమార్ మహాజన సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు కేంద్రీయ విద్యాలయ విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రాజ్ ఝురియా తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అబ్బిగారి యశ్వంత్ ఈనెల 25, 26వ తేదీలలో హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని కెవిఎస్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కోచ్ పి.మహేష్‌బాబు, కో-ఆర్డినేటర్ అరవింద్‌కుమార్, ఆర్య, పాఠశాల సిబ్బంది యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపికైన యశ్వంత్

ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీచైతన్యలో ఘనంగా హరిత భారత్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్ఎస్‌రోడ్డు లోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం హరితభారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులచే పలు రకాల మొక్కలను సేకరించి నాటించారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయం నుంచి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలే ప్రాణి కోటి జీవన మనుగడకు ఆధారమని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, అకాడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కస్తూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

రుణాలు సక్రమంగా చెల్లించేలా సిబ్బంది బాధ్యత తీసుకోవాలని రాయచోటి ప్రాంతీయ సమన్వయకర్త కొండా శ్రీనివాసులురెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న లోకోస్ యాప్ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు మంజూరు చేసిన అన్ని రుణాలు సకాలంలో చెల్లించే విదంగా కృషి చేయాలన్నారు. బకాయిలున్న సంఘాలకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. సంఘాల, సమాఖ్యల సమాచారమంతా లోకోస్ యాప్ ద్వారా జాతీయ గ్రామీణ జీవనోపాదుల పథకంతో అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదులో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎపియం ఖాదర్‌వలి, రీసోర్స్ పర్సన్లు శ్రీనివాస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని కందుకూరులో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఎనిమిది రోజుల ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సత్యసాయి, అనంతపురం కడప జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రవీంద్రబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. మతగురువు మొహమ్మద్ ముఖ్తియార్ షాఖాద్రి ఆధ్వర్యంలో ప్రతేకప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఊరు పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు